క్లుప్తంగా

దేవీ శరన్నవరాత్రులకు ముస్తాబైన ఆలయాలు



నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 15 నుంచి దేవీశరన్నవ రాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పలు దేవాలయాలు ముస్తాబయ్యాయి. తొమ్మిది రోజులపాటు నవరాత్రులు నిర్వహించనున్నారు. సాతులూరులోని గంగా పార్వతీ సమేత సోమేశ్వరాలయం, తూర్పు బజారులోని ఆర్యవైశ్య వీధిలో రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయం, కాటి అంకమ్మ, తేనె అంకమ్మ ఆలయం, విఘ్నేశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్రులకు ఏర్పాట్లు చేస్తున్నారు. గణపవరంలోని కోదండ రామాలయం, శివాలయం, నాదెండ్లలోని శివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

సెవెన్త్‌డే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



నాదెండ్ల: చిరుమామిళ్ల ఎస్సీ కాలనీలోని సెవెన్త్ డే చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ ప్రార్థనల్లో గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో ప్రజలంతా శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలన్నారు. కక్షలు, కార్పణ్యాలు లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో పయనించాలన్నారు. చర్చి నిర్మాణానికి గతంలో తనవంతు ఆర్థిక సాయం అందించానని, ప్రస్తుతం చర్చికి ప్రహరీగోడ, బాత్రూం తన స్వంత నిధులతో ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. అనంతరం చర్చి ఫాస్టర్, సంఘపెద్దలతో ఆయన్ను శాలువాలతో సత్కరించారు.

వాసవీక్లబ్ రథసారథి చిలంకూరికి అవార్డు



వినుకొండ(నూజెండ్ల): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన గుడిపాటి వీకెండ్ మహోత్సవంలో వినుకొండ వాసవీక్లబ్ అధ్యక్షులు చిలంకూరి కోటేశ్వరరావుకు, సతీమణి చిలంకూరి శారద దంపతులకు సూపర్ బెస్ట్ అవార్డు, బెస్ట ఆల్బమ్ అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా స్థానిక వాసవీ క్లబ్ కార్యాలయంలో కోటేశ్వరరావు దంపతులకు అవార్డులు అందజేసి వాసవీ క్లబ్స్ సభ్యులు అభినందించారు. అదేవిధంగా పలు అవార్డులు పొందిన వాసవీ క్లబ్స్ సభ్యులకు పురప్రముఖులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ, వనిత, యూత్ క్లబ్ సభ్యు లు తదితరులు పాల్గొన్నారు.

సింధూరను సన్మానించిన కళాశాల యాజమాన్యం



నరసరావుపేట ఈస్ట్: న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌సీసీ తల్ సైనిక్ ఫైరింగ్ క్యాంపులో పాల్గొన్న శ్రీ సుబ్బరాయ నారాయణ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ వాసిమల్ల సింధూరను శుక్రవారం కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ విభాగం నుంచి తమ విద్యార్థిని సింధూర తల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొనడం అభినందనీయమని కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త తెలిపారు. సింధూరను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్ సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కె రాజు, అధ్యాపకులు అభినందించారు.

ప్రతివారిలో అంతర్లీనశక్తి ఒకటి దాగి ఉంటుంది



యడ్లపాడు: ప్రతి విద్యార్థిలోనూ అంతర్లీనంగా ఏదో తెలియని గొప్పశక్తి దాగి ఉంటుందని, దానిని గుర్తించి వెలికి తీసిన వారు జీవితంలో ఉన్నత స్థానాన్ని చేరుకుంటారని మనోవిజ్ఞానవేత్త సుగంధరావు చెప్పారు. మండలంలోని లింగారావు పాలెం జెడ్పీహైస్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, విద్యాభ్యాసంపై మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్య పఠనంతో పాటు యోగ, ధ్యానం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రామిరెడ్డి, డి రామాంజనేయులు, టి విజయ్‌శ్యామ్యూల్ పాల్గొన్నారు.



పాతూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ఇనిమెళ్ల వైద్యశిబిరంలో రక్త పరీక్షలు చేయించుకుంటున్న వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



తుర్లపాడు క్యాంపులో రోగులకు సూచనలు చేస్తున్న వైద్యురాలు పూజిత

ప్రజల ముంగిటకే ఉచిత వైద్యం

- వారి కోసమే ఏర్పాటు చేసిన కార్యక్రమమే జగనన్న సురక్ష
- శిబిరాలను ఆరంభించి ప్రసంగించిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, బ్రహ్మనాయుడు
- రోగులతో మాట్లాడి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ముంగిటకే ఉచితంగా మెరుగైన వైద్యం తీసుకొచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతూరులోని 27, 28, 31 వార్డులకు సంబంధించిన సచివాలయం ఆవరణలో ఏడు వార్డులకు చెందిన ప్రజలకోసం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెడికల్ క్యాంపును వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన రోగులకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. మందులను పరిశీలించారు. ఒక డాక్టర్‌గా రోగులకు సత్వరమే సేవలు అందజేసేందుకు ఆరోగ్య సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వార్డు నాయకుడు కురుగుంట్ల కోటిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు ప్రభుత్వం చేస్తుందన్నారు. పట్టణాల్లో క్యాంపుకు వచ్చిన ప్రతి రోగికి ఏడు రకాల వైద్య పరీక్షలు, 102 రకాల మంచి మందులను రోగాలను బట్టి ఉచితంగా అందజేస్తూ ఎంతో ఖరీదైన వైద్యం ఉచితంగా కల్పిస్తుందన్నారు. ముదిరాజు సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం.స్వామి మాట్లాడుతూ ఆరోగ్యఆంధ్ర కోసం సీఎం జగన్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి మాట్లాడుతూ సీఎం జగన్ విద్యతో పాటు వైద్యానికి విశేష ప్రాధాన్యమిచ్చారన్నారు. క్యాంపులో రోగుల కోసం సీడీపీవో సూపర్‌వైజర్ గౌసియా భేగం ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలతో ఏర్పాటుచేసిన స్టాల్‌లోని పదార్థాలను రుచిచూసి వారిని అభినందించారు. క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ గోపిరెడ్డి హర్షవర్ధన రెడ్డి రోగులకు అందజేస్తున్న సత్వర సేవలు, మందులను గురించి ఎమ్మెల్యేకు వివరించారు. రోగులకు డాక్టర్లు ప్రత్యూష, మేఘన, ప్రియాంకలు వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, ఎంఆ కన కారావు, డీఈ శ్రీనివాసరావు, మాదిగ, గిరిజన సంక్షేమ కార్పొరేషన్ల డైరెక్టర్లు కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు అచ్చిశివ కోటి, వంకా శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, కాకుమాను సదాశివరెడ్డి, కోటిరెడ్డి, షేక్ మాబు, సయ్యద్ ఫాతిమా పాల్గొన్నారు.



నరసరావుపేట ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్ష చేయించుకున్న రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఇనిమెళ్లలో...

ఈపూరు: రాష్ట్రంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బొల్లా ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, కంటి సమస్యలు తదితర వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి దీర్ఘకాలిక రోగాలు ఉన్నవారిని గుర్తించి మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి వారికి కార్పొరేట్‌స్థాయి వైద్యం అందించనున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కోపెల దేవరాజ్, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, అబ్బులు, ఎంపీడీవో రంగనాయకులు, వైద్యులు, వైద్యసిబ్బంది, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లింగంగుంట్లలో...

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల-1 సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులు అధిక సంఖ్యలో సురక్ష శిబిరానికి హాజరయ్యారు. వైద్య శిబిరానికి చికిత్స కోసం 254 మంది హాజరుకాగా 162 మంది మహిళలు, 92 మంది పురుషులు, పాఠశాల విద్యార్థులు 9 మంది ఉన్నారు. కోటప్పకొండ, పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నందకుమార్, డాక్టర్ ఇబ్రహీంలు వైద్య సేవలు అందించారు. వైద్యశిబిరాన్ని జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర రెడ్డి, తహసీల్దార్ రమణా నాయక్, ఈవోపీఆర్డీ విజయ కుమార్, గ్రామ మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయ కృష్ణారెడ్డిలు పర్యవేక్షించారు.

తురుమెళ్లలో...

రొంపిచర్ల: మండలంలో తురుమెళ్ల గ్రామంలో రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో గైనకాలజీ వైద్యులు డాక్టర్ భారతిదేవి, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ వి.చంద్రతేజ, రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పి.జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ బి.మురళీధర్‌లు పాల్గొని వైద్యసేవలు అందించారు. ఈ వైద్య శిబిరములో గ్రామానికి చెందిన 352 మందికి వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 163 మంది పురుషులకు, 189 మంది మహిళలకు వైద్య సేవలు అందించారు. 145 మందికి వివిధ వ్యాధులకు సంబంధించిన రక్తపరీక్షలు నిర్వహించారు. అదే విధంగా 58 మందికి హిమోగ్లోబిన్, 58 మందికి ర్యాబీస్, ఐదుగురికి మలేరియా, నలుగురికి డెంగ్యూ, 20 మందికి యూరిన్, నలుగురికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఆయా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటం శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మూగచింతలపాలెంలో...

బొల్లాపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. మండలంలోని మూగచింతలపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు సక్రమంగా లభించక ఇబ్బందులు పడుతున్న పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నాణ్యమైన, సురక్షితమైన వైద్యం అందుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో బొల్లాపల్లి, వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శంకర్ నారాయణ, పి.కృష్ణానాయక్ ప్రత్యేక వైద్యనిపుణులు రేణుకాదేవి, శంకర్ రోగులకు వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహించి అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో 435 మందికి వైద్యచికిత్స చేశామని, వీరిలో 74 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, ఆరుగురిని ఆరోగ్యశ్రీ ద్వారా వివిధ కార్పొరేట్ హాస్పిటల్స్‌కు సిఫార్సు చేశామని బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలపాటి అంజమ్మ, ఎంపీటీసీ కడియం జోజి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బి. గురవయ్య పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: ప్రతి ఇంటి గడప వద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి ఒక్క రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించటమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 1,2,3,4 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, సొసైటీ చైర్మన్ కొండవీటి ఆంజనేయులు, వార్డు కౌన్సిలర్లు చెమిటిగంటి పార్వతి, విల్సన్, నాయకులు తాళ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుర్లపాడు సచివాలయంలో..

యడ్లపాడు: ప్రతి కుటుంబానికి సంపూర్ణ వైద్యం అది ఉచితంగానే అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని సర్పంచ్ ఆర్ వేణుగోపాలరావు తెలిపారు. యడ్లపాడు మండలం తుర్లపాడు సచివాలయం ప్రాంగణంలో శుక్రవారం సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించారు. సందెపూడి, గణేశునివారిపాలెం, తుర్లపాడు గ్రామాల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో ముందుగా కార్యక్రమ ఉద్దేశాన్ని, అలాగే స్పెషలిస్టు వైద్యులను పరిచయం చేసుకున్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు ఎం ప్రభాకరరావు ఆధ్వర్యంలో కొనసాగింది. స్పెషలిస్ట్ వైద్యులు శ్రీనివాసరావు, పి.పూజిత, షేక్ నజీర్, బి.ప్రతాప్ హాజరై వివిధ రకాల వైద్యసేవలను అందజేశారు. రెండు గ్రామాల పరిధిలో మొత్తం 406 మంది రోగులకు ఓపీలు రిజిస్ట్రేషన్‌లు కాగా టోకెన్‌లు లేని సర్వర్‌లో నమోదు కాని వారికి సైతం అవసరమైన అన్ని పరీక్షలు చేసి చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. వీరితో పాటు 138 కంటి సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేసి 90 కళ్లజోళ్లు అవసరం అవుతాయని నిర్ధారించారు. దీర్ఘకాల, ఇతరేత్ర వ్యాధులకు పూర్తిస్థాయి వ్యాధి నిర్ధారణ, సర్జరీలు అవసరమైతే ఆరోగ్యశ్రీలో చేయించుకునేలా 25 మందిని గుర్తించి పై ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధుని, సీహెచ్‌వో ఎస్.పున్నారావు, సూపర్‌వైజర్ వి.రాజశేఖర్, హెల్త్ విజిటర్ గంగానమ్మ, కార్యదర్శి సుబ్బారావు, చుండి రమేష్, హరిబాబు, గణేశుని రాజేశ్వరరావు, సతీష్‌చంద్ర, అంకమ్మరావు, వి.కోటయ్య, మస్తాన్, హరిబాబు, పూర్ణచంద్రరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరాలు..

నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళ ప్రాథమిక పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గణపవరం, నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులతో పాటూ చినకొండ్రుపాడు కాటూరి వైద్యశాల డాక్టర్ల బృందం రానున్నట్లు తెలిపారు. క్యాంపును స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 9 గంటలకు క్యాంపును ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, స్థానిక నాయకులు హాజరౌతారన్నారు.

నేడు మతుకుమల్లిలో..

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపా రు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు 105 రకాల మందులు వివిధ వైద్య పరీక్షలు ఉచితంగా చేసిన తదుపరి మందులు అందజేస్తారన్నారు. ఆయనతోపాటు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు,వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ ఉన్నారు.



నరసరావుపేటలో ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



మూగచింతలపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



నరసరావుపేట శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న మహిళా డాక్టర్లు



మూగచింతలపాలెంలో వివరాలు నమోదు చేసుకుంటున్న వైద్యులు



తుర్లపాడు క్యాంపులో రోగితో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యులు ప్రభాకరరావు

జగనన్న హయాంలోనే సంక్షేమ పాలన

- ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందంజ
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందంజలో ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా స్థానిక బొల్లా బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి అండ నాయకులు, కార్యకర్తలే అని, స్వలాభం కోసం ఆశించకుండా పార్టీ గెలుపు కోసం మీరు చేసే కృషి అభినందనీయమన్నారు. టీడీపీకి చెందిన ఓ వృద్ధుడు పాదయాత్ర చేస్తుంటే వైఎస్సార్ సీపీ వారు దాడి చేశారంటూ టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వీటిని నమ్మే ప్రజలు వినుకొండలో లేరని తెలిపారు. వాస్తవంగా ఆ వృద్ధుడు అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరితే అది కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకున్న నీచ రాజకీయ నాయకుడు జీవీ ఆంజనేయులు అని మండిపడ్డారు. టీడీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని, వారి స్థాయిని మించి మాట్లాడుతున్నారని, ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వారిని అసభ్య పదజాలంతో దూషించడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన పొత్తువల్ల మన పార్టీకి జరిగే నష్టం ఏమీ లేదని, పొత్తుల యొక్క సీట్లపై వారిలో వారికే అంతర్గత విభేదాలు ఉన్నాయని, టీడీపీ వెన్నుపోటు రాజకీయానికి జనసేన బలి అవుతుందని తెలిపారు. పదేళ్ల ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు నియోజకవర్గానికి చేసిన ఒక్క అభివృద్ధి పని ఏంటో చెప్పాలన్నారు. గతంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని భూకబ్జాలకు పాల్పడ్డారని, బినామీ పేర్లతో నియోజకవర్గంలో ఉన్న నిరుపేదల భూములతో పాటు ప్రభుత్వ భూములను కూడా స్వాహా చేసిన ఘనుడు జీవీ ఆంజనేయులు అని అన్నారు. చివరకు ఎస్ఎస్‌పీ వారికి చెందిన పంట పొలాలకు వెళ్లే కాలువ మీద గెస్ట్ హౌస్‌ను కట్టుకున్న నీచపు బుద్ధి జీవీ ఆంజనేయులుదని అన్నారు. మీరు చేసే అసత్య ఆరోపణలకు భయపడే వ్యక్తి కాదు ఈ బ్రహ్మనాయుడు అని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుస్తారని, పార్టీ శ్రేణులు నమ్మకం ఉంచాలని అన్నారు.

మన వినుకొండలో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రతి గ్రామంలో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఇప్పటివరకు మనం చేసిన అభివృద్ధిని వివరిస్తూ పుస్తకం ప్రచురించి ప్రతిగ్రామంలో అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్‌లు, మండల, గ్రామ పార్టీల అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సోషల్ మీడియా సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

18న రేణుకాంబ, గంగమ్మతల్లి ఆలయ ప్రతిష్ట

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కెల్లంపల్లి వారి ఇలవేల్పు అయిన రేణుకాంబ, గంగమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 16, 17, 18 తేదిల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో 16వ తేది నుంచి మూడు రోజుల పాటూ ప్రతిష్ఠాదుకు చెందిన ఆదిత్య పూజారి బృందం ఆధ్వర్యంలో యాగశాలలో శాంతి హోమాలు నిర్వహించనున్నారు. అదేరోజు అమ్మవార్లను గంగా జలాభిషేకం, 17న అభిషేకాలు, గ్రామోత్సవం, 18న ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమం జరగనుంది. కార్యక్రమాలను మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందర రావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు కెల్లంపల్లి అచ్చయ్య పర్యవేక్షిస్తున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో విషసర్పం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం విష సర్పాలకు ఆవాసంగా మారింది. దీంతో కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది భయాందోళనకు గురౌతున్నారు. శుక్రవారం ప్రధాన ద్వారం వెంబడి పెద్ద పాము చుట్టచుట్టుకుని ఉండటాన్ని కార్యాలయ సిబ్బంది గమనించారు. అప్రమత్తం కావటంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పిల్చుకున్నారు. గతంలో పలుమార్లు ఇటువంటి సంఘనలు లేకపోలేదు. మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ముళ్ళకంచెలు పొదలు ఉండటం వల్లే పాముల సంచరిస్తున్నాయనీ, సత్వరమే వీటిని తొలగించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

రేపు పల్నాడు కవితోత్సవం

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 8వ తేదీ ఆదివారం పల్నాడు కవితోత్సవం పేరుతో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండాల రాకేష్ శుక్రవారం తెలిపారు. రామిరెడ్డిపేటలోని డాక్టర్ రాధా సుందర కళ్యాణ మండపం వేదికపై జరగనున్న కవితోత్సవానికి కవులు హాజరవుతారని వివరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కవులు ఈ ఉత్సవంలో పాల్గొని సాహిత్యగోష్టి జరుపుతారని వివరించారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ పథకంలో భాగంగా స్వయం సంఘాల్లోని మహిళ సభ్యులు అభ్యున్నతికి దోహదపడుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో రెండవ రోజు శిక్షణా తరగతుల్లో ఎంపీడీవో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు సామాజిక,ఆర్థికంగా,కుటుంబ పరమైనవాటిలో భాగస్వామ్యం చేసి వాటిలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేలా శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు.

ఖో-ఖో పోటీలకు శంకరభారతీపురం విద్యార్థినులు



నరసరావుపేట రూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-18 జూనియర్ ఖో-ఖో ఎంపిక పోటీలలో లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి శుక్రవారం తెలిపారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎంపిక పోటీలలో పాఠశాల విద్యార్థినులు సి.హెచ్.సాజన్య, టి.లక్ష్మీ ప్రసూన చంద్రిక, డి.రంగ మహాలక్ష్మీలు ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 20, 21, 22 తేదీలలో చిత్తూరు జిల్లా మాదమరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలలో ఎంపికైన విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. అలాగే నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన 8వ ఏపీ సబ్‌జూనియర్ రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలలో జిల్లా జట్టుకు మూడవ స్థానం లభించినట్టు తెలిపారు. పాఠశాల విద్యార్థిని సి.హెచ్.వర్షిత జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించి ప్రతిభ చాటినట్టు వివరించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, పి.తిరుపతిరావు, ఎస్.కె.ఫాతిమా, ఉపాధ్యాయులు టి.సుబ్బారావు, ఎస్.కె.కరీముల్లా, పి.సుబ్బారావులు విద్యార్థినులను అభినందించారు.